క్లుప్తంగా

నేడు పీలేరులో మెగా జాబ్‌మేళా

రాయచోటి జగదాంబసెంటర్ : ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లాలోని పీలేరులోని సంజయ్‌గాంధీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 12వ తేదీన ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగమేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, ఆసక్తి గల యువతీయువకులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వన్‌టౌన్ సీఐగా మహమ్మద్ రఫీ



మదనపల్లె రూరల్ : మదనపల్లె వన్‌టౌన్ సీఐగా మహమ్మద్ రఫీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సీఐల బదిలీల్లో భాగంగా వైఎస్సార్ కడపజిల్లా కొండాపురం సర్కిల్ సీఐగా పనిచేస్తున్న మహమ్మద్‌రఫీని మదనపల్లె వన్‌టౌన్ సీఐగా బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎరీషావలీ సస్పెండ్ కాగా, ఆయన స్థానంలో మహమ్మద్ రఫీ బాధ్యతలు చేపట్టారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం అందించి సహకరించాలని కోరారు.

రౌద్రాల అంకాలమ్మ ఆలయ చైర్మన్‌గా రామకృష్ణారెడ్డి



పీలేరురూరల్ : స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వెలసిన రౌద్రాల అంకాలమ్మ ఆలయ చైర్మన్‌గా కె. రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయశాఖ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ నెల 18న ఆలయంలో నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం



ప్రత్యేక అలంకరణలో యోగభోగేశ్వరుడు

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీయోగభోగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ సోమవారం పురస్కరించుకుని స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నప్రసాదవితరణ చేశారు. కార్యక్రమంలో ఈఓ రమణ, సిబ్బంది అంకన్న పాల్గొన్నారు. అలాగే స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.

ఆటో డ్రైవర్ల ధర్నా



ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

బి.కొత్తకోట: స్థానిక ఆటోడ్రైవర్లు సోమవారం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమ నుంచి రూ.10 వసూలు చేస్తున్న గేటును ఇవ్వలేమని చెబుతూ ఆందోళన చేపట్టారు. గేటు వసూలు లీజు పొందిన గుత్తదారుడు ప్రతిరోజూ రూ.10 వసూలు చేస్తున్నారని కమిషనర్ జీవీ.పల్లవికి వివరించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ గుత్తదారుడికి వసూలు చేసే హక్కు ఉందని చెప్పారు. నిబంధనల మేరకే వసూలు చేస్తారని, గేటు చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పట్టణ పరిధిలో నూతనంగా నిర్మించిన శ్రీసత్యసాయి మందిరం ఆవరణలో సత్యసాయిబాబా, షిర్డి సాయిబాబా, శ్రీకృష్ణ పరమాత్మ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మందిరం ఆవరణలో ఉదయం హోమాది కార్యక్రమాలు, భజనలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ విగ్రహాల ప్రాణప్రతిష్ట చేశారు. పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరై ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. పండితులు ఆయనను వేద మంత్రాలతో ఆశీర్వదించారు. సాయంత్రం మందిరంలో భక్తులు భజనలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతల శివానందరెడ్డి, చింతల ఆనందరెడ్డి, నీళ్ల భాస్కర్, జే.క్రిష్ణమూర్తి, బిడ్డల కేశవరెడ్డి తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పూజలలో పాల్గొన్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ఎదుర్కొందాం





కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి , సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- అక్రమ కేసులకు వెరవకుండా కలిసి కట్టుగా పోరాడుదాం
- కక్ష సాధింపుకోసమే ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు
- కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి
- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి: రాష్ట్రంలో అమలవుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ధైర్యంగా ఎదుర్కొందామని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కలికిరిలోని అజయ్ ఫంక్షన్ హాలులో సోమవారం ×బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ× కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులపై కేసులు బనాయించి అక్రమ అరెస్టులు, జైలులో నిర్బంధాలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వానికి పరిపాలనకు అధికారమిస్తే కూటమి నేతలు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ రాక్షసానందం పొందుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలతో పాటు సూపర్ సిక్స్, సెవెన్ పథకాలు అమలు చేస్తామని, విద్యుత్ చార్జీలు తగ్గిస్తాము తప్ప ఎట్టి పరిస్థితుల్లో పెంచబోమన్న చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను ఘోరంగా మోసగించారన్నారు. ఏడాదిన్నర కావస్తున్నా ఏ ఒక్క పథకాన్ని ప్రజలకు చేరువచేయలేదని ఆరోపించారు. రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పేరుతో గ్రామ స్థాయిలో నాయకులు, కార్యకర్తలకు ప్రజలకు చంద్రబాబు మోసాలను వివరించాలని క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. పార్టీ పునర్నిర్మాణంలో భాగంగా పార్టీ, అనుబంధ విభాగాలకు సంబంధించి మండలం నుంచి ఎంపికైన రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి, మండలం, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలకు నియామక పత్రాలు అందచేసి అభినందించారు. పార్టీ ఆదేశానుసారం కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు.

పెద్దిరెడ్డి కుటుంబంపై బాబు కక్ష సాధింపు : రాష్ట్రంలో రాజకీయంగా మంచి గుర్తింపు ఉన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై చంద్రబాబు కక్ష సాధింపుతోనే ఎంపీ మిథున్ రెడ్డిని లేని లిక్కర్ స్కామ్‌లో ఇరికించి అక్రమ అరెస్టు, జైలులో నిర్బంధించారన్నారు. ఎంపీ అక్రమ అరెస్టుకు నిరసనగా శాంతియుతంగా పీలేరులో ర్యాలీ నిర్వహించినా తనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై మళ్ళీ అక్రమ కేసు బనాయించారన్నారు. అక్రమ కేసులు, అరెస్టులకు బయపడేదిలేదన్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా ముందుకెళ్లాలన్నారు. ఎల్లవేళలా నాయకులు, కార్యకర్తలకు తోడుగా నిలుస్తానన్నారు. కార్యక్రమంలో మైనార్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, నియోజకవర్గ ప్రత్యేక ఆహ్వానితులు సి.హరీష్ రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్డీడి హరి, రాష్ట్ర కార్యదర్శి ఆఫూమొహిద్దీన్, సంయుక్త కార్యదర్శి మాసూం రఫీ, జిల్లా ఉపాధ్యక్షులు నల్లారి శ్రీకర్‌రెడ్డి, మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, నాయకులు భాస్కర్ రెడ్డి, రత్నశేఖర్‌రెడ్డి, మురళీనాధరెడ్డి, రామచంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కేవీపల్లి, కలకడ మండల పార్టీ కన్వీనర్లు వెంకటరమణారెడ్డి, కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి బాధ్యతల స్వీకరణ
- సచివాలయ సెక్రటరీగా ఉద్యోగ జీవితం ప్రారంభం



మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

మదనపల్లె రూరల్ : ప్రజాసమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజలు సమర్పించే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో, వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని నూతన సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి అన్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో మదనపల్లె రెవెన్యూ డివిజన్ 164వ సబ్ కలెక్టర్‌గా చల్లా కల్యాణి బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఉదయం రాయచోటిలో కలెక్టర్ శ్రీధర్ చామకూరిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న అనంతరం ఆమె మదనపల్లెకు చేరుకున్నారు. సబ్ కలెక్టరేట్‌లో డీఏఓ నిర్మలాదేవి నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ప్రతి సోమవారం సబ్ కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ...శ్రీ కాకుళం జిల్లా బొప్పంగి గ్రామం తన స్వస్థలం అన్నారు. తండ్రి అసిరినాయుడు రైతు అని, తమది వ్యవసాయ కుటుంబంగా పేర్కొన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామం బొప్పంగిలో జరిగిందని, ఇంటర్మీడియట్ విశాఖపట్నంలో చదివినట్లు తెలిపారు. ఢిల్లీలోని ఎస్ఆర్‌సీసీ యూనివర్సిటీ నుంచి బీకాం హానర్స్ డిగ్రీ చదివానన్నారు. చదువు పూర్తయ్యాక, ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా శ్రీకాకుళం మండలం సానివాడ(శ్రీపురం) గ్రామ సచివాలయంలో పంచాయతీ సెక్రటరీగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. తర్వాత ఎస్‌టీఓ ఆఫీస్‌లో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ..సివిల్స్ పరీక్షలు రాసి 2023 ఐఏఎస్ బ్యాచ్‌కు ఎంపికై ముస్సోరిలో శిక్షణ పొందినట్లు తెలిపారు. తర్వాత అసిస్టెంట్ కలెక్టర్‌గా కర్నూలులో శిక్షణ పూర్తి చేసుకున్నట్లు చెప్పారు. శిక్షణ తర్వాత రాష్ట్రప్రభుత్వం మదనపల్లె సబ్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ ఇచ్చిందన్నారు. దేశంలోనే అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా పేరుమోసిన మదనపల్లె రెవెన్యూ డివిజన్‌కు సబ్ కలెక్టర్‌గా రావడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చల్లా కల్యాణికి జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బాబ్జీ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు శారదారెడ్డి, వినుతాభాయి, మంజుల, లలితారెడ్డి, టీడీపీ నాయకులు ఆర్.జే.వెంకటేష్, రాటకొండ మధుబాబు, రాటకొండ సోమశేఖర్ తదితరులు సబ్‌కలెక్టర్‌ను కలిశారు.

బెల్టుషాపు ఎత్తివేయించి పుణ్యం కట్టుకోండి



బెల్టుషాపు ఎత్తివేయించాలని సబ్ కలెక్టర్ చల్లా కల్యాణికి విన్నవిస్తున్న ఎనుములవారిపల్లె మహిళలు

- సబ్ కలెక్టర్‌కు ఎనుములవారిపల్లె మహిళల వినతి
- ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 72 ఫిర్యాదులు

మదనపల్లె రూరల్ : గ్రామంలోని బెల్టుషాపు కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, బెల్టుషాపు ఎత్తివేయించి పుణ్యం కట్టుకోండి మేడమ్ అంటూ మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ ఎనుములవారిపల్లెకు చెందిన మహిళలు సబ్ కలెక్టర్ చల్లా కల్యాణికి వినతిచేశారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల నుంచి వివిధ రకాల రెవెన్యూ సమస్యలపై 72 ఫిర్యాదులు అందాయి. ఎనుములవారిపల్లెకు చెందిన మహిళలు తమ గ్రామంలో అంగజాల భాస్కర్, రమాదేవి, శ్రీనివాసులు, టి.నారాయణ, అనూరాధ అనే వ్యక్తులు యథేచ్ఛగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నారని ఫిర్యాదుచేశారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. గతంలో జైలుకు వెళ్లినప్పటికీ ఏమాత్రం లెక్కచేయకుండా బెల్టుషాపు నిర్వహిస్తున్నారన్నారు. వీరిపై చర్యలు తీసుకుని, గ్రామంలో మద్యం విక్రయించకుండా చూడాలని కోరారు.

– అనంతపురంలోని నడివంకలో కాపురం ఉంటున్నప్పుడు టిడ్కో ఇంటి కోసం రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకున్నామని, పట్టా ఇచ్చిన తర్వాత ఇల్లు ఇవ్వకపోవడంతో జీవనోపాధిలో భాగంగా ఐదేళ్ల క్రితం మదనపల్లెకు వచ్చేశామని, ప్రస్తుతం ఇంటికి దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్‌లో ఇవ్వని టిడ్కో ఇల్లును చూపిస్తోందని, దాన్ని రద్దు చేసి మదనపల్లెలో ఇల్లు కేటాయించాల్సిందిగా ఎస్.అయేషా ఫాతిమా సబ్ కలెక్టర్‌కు వినతిచేసింది.

– రేషన్‌కార్డులో గ్రామ సచివాలయ ఉద్యోగం పొందిన కూతురు పేరు ఉందని రద్దుచేశారని, కుమార్తెకు వివాహమై వేరుగా ఉంటోందని, వృద్ధులమైన తమకు రేషన్‌కార్డు మంజూరుచేసి వృద్ధాప్యంలో ఆదుకోవాల్సిందిగా పోతబోలు కూగర్తి గంగులప్ప, శంకరమ్మలు విన్నవించారు.

ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్ ఉద్యోగాలు

మదనపల్లె సిటీ: ఆన్‌కాల్ పద్ధతిపై డ్రైవర్ పోస్టులకు అర్హులైన వారిని ఎంపిక చేయనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆన్‌కాల్ పద్ధతిపైన డ్రైవర్ పోస్టుకు అభ్యర్థులు వయోపరిమితి 21–40 సంవత్సరాలు ఉండాలన్నారు. హెవీ వెహికల్ లైసెన్స్ కలిగి ఉండాలని, డ్రైవింగ్‌లో 18 నెలల అనుభవం కలిగి ఉండాలన్నారు. ఆర్‌టీఏ క్లియరెన్స్ అర్హత గల సర్టిఫికెట్లతో వన్ డిపో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నులిపురుగుల నివారణే లక్ష్యం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

ములకలచెరువు: నులిపురుగుల నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని వైద్యాధికారులు పేర్కొన్నారు. సోమవారం మండలంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డాక్టర్ రేష్మా, వైద్య సిబ్బంది పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిబ్బంది మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ విద్యార్థులకు అల్బెండజోల్ తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ఇందిర, శాంతమ్మ, ఖాదర్ బాషా, నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శ్రీరాములు

మదనపల్లె సిటీ: మదనపల్లె పద్మశాలి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గుత్తికొండ త్యాగరాజు, అధ్యక్షుడిగా శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.వెంకటసుబ్బయ్య,గౌరవ సలహాదారుగా మురహరి, ఉపాధ్యక్షులుగా మురళి, ఆనంద్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా రమేష్, రెడ్డప్ప,కోశాధికారులుగా రెడ్డప్ప, రమేష్, ప్రచార కార్యదర్శిగా అదెప్ప, పిఆర్‌ఓగా రాజేష్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా అమరాతి, సుభాషి ఎన్నికయ్యారు.

హామీ నిలుపుకోని కూటమిప్రభుత్వం

- సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం
- చలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరించిన ఏపీసీపీఎస్‌ఈఏ నేతలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీ సీపీఎస్ ఈఏ నాయకులు, సభ్యులు

మదనపల్లె రూరల్ : ఏడాదిలోపు సీపీఎస్ రద్దుకు పరిష్కారం చూపిస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ ఇచ్చి సంవత్సరం పూర్తయిందని, ఇప్పటివరకు హామీ నెరవేర్చకపోగా డీఏ బకాయిలు ఇవ్వలేదని ఏపీ సీపీఎస్ఈఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రంజిత్, ఉపాధ్యక్షులు సారకాయల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రకుమార్ అన్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్ ఆవరణలో సీపీఎస్ ఉద్యోగులతో కలిసి, సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహదినం, చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఐదేళ్ల రాజకీయసేవ చేసే ఎంపీ, ఎమ్మెల్యేలు రెండు రకాల పెన్షన్లు తీసుకుంటుంటే, 35 సంవత్సరాలు ప్రభుత్వ సర్వీస్ చేసే ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. సీపీఎస్ రద్దుచేసి, పాత పెన్షన్ ఇవ్వకపోతే తీవ్రంగా ఉద్యమాలు చేయాల్సి వచ్చిందని, కూటమిప్రభుత్వం ఇకనైనా స్పందించి పాత పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదవీవిరమణ తర్వాత ఆర్థికభద్రత, సమాజంలో గౌరవంగా బతకాలంటే పాతపెన్షన్ కచ్చితంగా అమలుచేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేయని పక్షంలో అన్ని సంఘాలను కలుపుకుని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ సీపీఎస్ఈఏ జిల్లా ఉపాధ్యక్షులు నరేష్, డివిజన్ అధ్యక్షులు గణేష్‌భూపతి, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, డివిజన్ కార్యదర్శి కిల్లా నాగరాజు, సబ్ కలెక్టరేట్ సిబ్బంది వినీషా, సాయి, విన్సెంట్, ఆర్కాట్ హరిప్రసాద్, బాలాజీసింగ్ పాల్గొన్నారు.


కలలు సాకారం చేసుకోవాలి



జ్యోతి వెలిగిస్తున్న అతిథులు

కురబలకోట: కొత్తగా బీటెక్‌లో చేరడం జీవితంలో మరచిపోలేని ఆరంభమని భవిష్యత్ కలల సాకారానికి నిరంతరం కృషి చేయాలని బెంగళూరు ఇన్ఫోబెల్ ఐటీ సొల్యూషన్స్ డైరెక్టర్ ఎస్‌జి గౌడ సూచించారు. అంగళ్లలోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ నూతన విద్యార్థులకు సోమవారం విశ్వం విద్యా సంస్థల అధినేత ఎం. ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ నుంచి కొత్తగా ఇంజినీరింగ్‌లో అడుగుపెట్టడం కొత్తదనంగా ఉంటుందన్నారు. బిటెక్ సమస్యలను పరిష్కరించే శక్తిని ఇస్తుందన్నారు. మరో విశిష్ట అతిధి బెంగళూరు ఎతినెస్ వైస్ ప్రెసిడెంట్ జేమ్స్ క్రిష్టి మాట్లాడుతూ తల్లిదండ్రులు కన్న కలలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు చదవు సంధ్యల్లో రాణించాలన్నారు. అనంతపురం జెఎన్‌టీయూ అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రమణారెడ్డి మాట్లాడుతూ కష్టపడకుండా ఏదీ సాధ్యం కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

మిథున్‌రెడ్డికి బెయిలు రావాలని పూజలు



ఆలయం ఎదుట టెంకాయలు కొడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మదనపల్లె: మద్యం అక్రమ కేసులో అరెస్టయిన ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిలు రావాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ ప్రార్థిస్తూ పూజలు నిర్వహించారు. సోమవారం స్థానిక నీరుగట్టువారిపల్లెలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కురబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ డి.రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయం ఎదుట 101 టెంకాయలను కొట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మిథున్‌రెడ్డికి బెయిలు రావాలని ప్రార్థించారు. అక్రమ కేసులతో కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలను వేధిస్తూ జైళ్లకు పంపుతోందని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరపన మనూజ, కౌన్సిలర్లు వెంకటశివారెడ్డి, రమణ, చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు రమేష్, మయూరి రఘునాధరెడ్డి, వీఎస్‌రెడ్డి, మేరీ, మునిశేఖర్, నాగమణి, మహేష్, జబీవుల్లా, రామాంజులు, మధు, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

పుండీశ్వర స్వామికి మహా కుంభాభిషేకం

రామసముద్రం: మండలంలోని మూగవాడి గ్రామంలో వెలిసిన పురాతన శ్రీ పుండీశ్వర స్వామికి సోమవారం శ్రావణమాసం సందర్భంగా వైభవంగా మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఉదయం స్వామివారికి వేదపండితులచే వేదమంత్రాలతో రుద్ర నమకం, రుద్ర చమకం పఠనం చేశారు. అలాగే స్వామివారికి 101 బిందెలా నీరు పోసి మహా కుంభాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు.

ప్రజలకు జగన్ పాలన గుర్తుకొస్తోంది

- రైతులకు ఎరువులు లేవుకాని వీధుల్లో మద్యం బెల్టుషాపులు
- సౌకర్యాల కల్పనలో ప్రభుత్వ విఫలం
- మాజీ ఎమ్మెల్సీ నరేష్, సమన్వయకర్త నిసార్ అహ్మద్



బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటి కార్యక్రమంలో నరేష్ కుమార్‌రెడ్డి, నిసార్ అహ్మద్, మనూజరెడ్డి

మదనపల్లె: వైఎస్ జగన్ ఐదేళ్ల సంక్షేమ పాలనను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్సీ, అనంతపురం పార్లమెంటు పరిశీలకులు బి.నరేష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్, మున్సిపల్ చైర్మన్ వి.మనూజరెడ్డి అన్నారు. సోమవారం మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని ఒకటి, రెండవ వార్డుల్లోని బీకేపల్లె, చంద్రాకాలనీల్లో నిసార్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఇంటింటికి వెళ్లి నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, పథకాల ద్వారా ఆర్థిక ప్రయోజనం కలుగుతోందా అని మహిళలను ప్రశ్నించారు. నిధులు ఖాతాలకు జమ అవుతున్నాయా, పింఛన్లు మంజూరు చేశారా అని అడుగుతుంటే ప్రజల నుంచి లేదన్న సమాధానం వస్తోంది. తమకు సంక్షేమం అందడం లేదని గట్టిగా చెబుతున్నారు. ఇదే సందర్భంలో ప్రజలు వైఎస్.జగన్ పాలనలో అందుకున్న పథకాలు, కలిగిన ఆర్థిక ప్రయోజనాల గురించి నాయకులకు వివరించారు. మహిళలు, యువకులు నుంచి క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడు సీఎం అయినా ప్రజలను మోసం చేయడం గ్యారంటి అని అన్నారు. 2014లో రైతు, మహిళల రుణాలు మాఫీ అని ప్రకటించి అధికారంలోకి వచ్చాక దగా చేశారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్, ఇతరా పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించి మోసం చేశారన్నారు. కూటమి పాలనలో ఏ వర్గానికి న్యాయం చేశారో చెప్పుకునే పరిస్థితి లేదన్నారు. అన్నదాత సుఖీభవ ఏడాది నిధులు ఎగ్గొట్టారని, ఇప్పుడు ఇచ్చిన పథకంలో అర్హులైన వేలమంది రైతులను పథకం నుంచి తొలగించారన్నారు. మదనపల్లెకు వైద్యకళాశాలను మంజూరు చేస్తే పేదలకు ఖరీదైన వైద్యం అందకూడదని కళాశాలను ప్రయివేటు పరం చేస్తున్నారన్నారు. జిల్లా ఆస్పత్రిలో వైద్యానికి తగినంత వైద్యులను నియమించకుండా పేదల ఆరోగ్యంతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మదనపల్లె మున్సిపాలిటికి మంజూరు చేసిన నిధులు ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. కూటమి పాలనలో రైతులకు ఎరువులు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బెల్టుషాపులు ఒక్కటిలేకుండా చేస్తే చంద్రబాబు పాలనలో అడుగుకో బెల్టుషాపు నిర్వహిస్తూ మద్యాన్ని పారిస్తున్నారని అన్నారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత, వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందు ప్రతిపక్ష పార్టీ నేతలను అక్రమ కేసులతో వేధిస్తున్నారని అన్నారు. మున్సిపల్ వార్డులు, పల్లెల్లో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాన్ని ఎండగడతామన్నారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు శివారెడ్డి, బాను, పాల్ చంద్రశేఖర్, ఈశ్వర్‌నాయక్, బీరంగి రేవతి, శాదరారెడ్డి, నరసింహులు, నూర్, మేరీ, మునిశేఖర్, చిన్నా, పవన్, మధు, నాగమణి, యూనస్, సాధిక్, మిలట్రి మల్లికార్జున, మహేష్ పాల్గొన్నారు.

భవిష్యత్ ఆవిష్కర్తలకు ప్రిజం ప్రోత్సాహం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ జ్యోత్స్న

కురబలకోట: వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలు సమాజ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా సాగాలని తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఔట్‌రీచ్ కమ్ క్లస్టర్ ఇన్నోవేషన్ సెంటర్ సమన్వయ కర్త ప్రొఫెసర్ పి. జ్యోత్స్న అన్నారు. అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో సోమవారం డీఎస్ఐఆర్ ప్రిజం పథకాలు–ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోత్సాహంపై వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ క్రియేటివ్ ఆలోచనలు వినూత్న పరిష్కారంగా మారి సమాజానికి ఉపయోగపడేలా చేయడమే ప్రిజం ప్రధాన లక్ష్యమన్నారు. కొత్త ఆలోచనలకు శక్తినిచ్చే ఒక వేదికే ప్రిజం పథకం అన్నారు. కలలను సాకారం చేయడంలో ఇది ప్రోత్సహిస్తుందన్నారు. ప్రధానంగా ఎంఎస్ఎంఈలు, స్టార్టప్స్, వ్యక్తిగత ఆవిష్కరణలకు ప్రిజం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. క్రియేటివ్ ఆలోచనలకు వాణిజ్య రూపం ఇవ్వడమే లక్ష్యంగా యువత ముందుకు సాగలన్నారు. తక్కువ ఖర్చుతో ఉత్పత్తుల తయారీ, అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ప్రిజం ద్వారా కొత్త ఆవిష్కర్తలకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు.

లయన్స్ క్లబ్ ప్లాటినమ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



ప్రముఖులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ నాయకులు

పీలేరురూరల్ : లయన్స్‌క్లబ్ ఆఫ్ పీలేరు ప్లాటినమ్ నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఎంఎస్ఆర్ కల్యాణమండపంలో 2025–26 నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాజీ గవర్నర్లు వి. విజయభాస్కర్ రెడ్డి, సి.వి. భానుమూర్తిరెడ్డి తెలిపారు. లయన్స్‌క్లబ్ ప్లాటినమ్ అధ్యక్షులుగా గ్యారంపల్లె రమేష్‌కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్. సురేష్, కోశాధికారిగా ఎ. శివఫణీష్ తోపాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. అలాగే జిల్లా కార్యదర్శిగా కె. సంజీవరెడ్డి, జోనల్ ఛైర్మన్‌గా బి. వేణుగోపాల్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సమాజంలో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శివశంకర్

పీలేరు : జిల్లా, స్థానికంగా పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలని ఎంపీడీవో జి. శివశంకర్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో పీజీఆర్ఎస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్జీని పరిష్కరించాలని తెలిపారు. మండలంలో తాగునీరు, డ్రైనేజ్, తడి, పొడిచెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని చెత్తసేకరణ వాహనాలు వాడకంలోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వై.వి. రమణరావు, ఎంఈవో పద్మావతి, సీడీపీవో రాజమ్మ, ఏపీఎం జవహర్‌బాషా, హౌసింగ్ డీఈ రమణ, ఈవో లతీఫ్‌ఖాన్, ఏవో రమాదేవి పాల్గొన్నారు.